క్లుప్తంగా

బడ్జెట్‌లో మైనార్టీ సంక్షేమానికి పెద్దపీట హర్షణీయం

జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ గౌస్ మొహిద్దీన్

వించిపేట(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో మైనార్టీలకు పెద్ద ఎత్తున కేటాయింపులు చేయడంపై ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ గౌస్ మొహిద్దీన్ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మైనార్టీలపై జగనన్నకు ఉన్న చిత్తశుద్ధికి ఈ బడ్జెట్ కేటాయింపులే నిదర్శనమని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు మైనార్టీ సంక్షేమానికి కేవలం రూ.1,100 కోట్లు మాత్రమే కేటాయించి చిన్నచూపు చూస్తే, నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీ సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రూ.2,242.36 కోట్లు కేటాయించారన్నారు. దీనిపై రాష్ట్రంలోని మైనార్టీలందరి తరఫున జగనన్నకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మైనార్టీలందరూ జగనన్నకు మద్దతుగా నిలబడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుంటామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు సన్మానం



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వృత్తి విద్యా కోర్సులను నేర్చుకున్న మహిళలు చిన్న తరహా పరిశ్రమలు స్థాపించి మరికొంత మందికి ఉపాధి కల్పించాలని జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాకన్నా అన్నారు. స్థానిక మధుచౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాలులో జరుగుతున్న మహిళా ఉత్సవ్–2024లో భాగంగా గురువారం సాయంత్రం ముగ్గురు మహిళా పారిశ్రామికవేత్తలు డాక్టర్ ఎస్.సాహితి, ఆళ్ళ నిర్మల కుమారి, డి.అపర్ణలను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యాకన్నా మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృత్తి విద్యాకోర్సులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. వృత్తి విద్యాకోర్సులను నేర్చుకున్న వారందరికీ ఉపాధి లభిస్తోందన్నారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ జనశిక్షణ సంస్థాన్‌లో జరుగుతున్న శిక్షణ తరగతులు మహిళల ఆర్థిక స్వావలంబనకు ఎంతగానో దోహదం చేస్తున్నాయన్నారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ, సంస్థాన్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర శాఖ ప్రారంభం



ఇబ్రహీంపట్నం: భారత ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 44వ శాఖను కొండపల్లి మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు గురువారం ప్రారంభించారు. ప్రజలకు ఉత్తమ బ్యాంకింగ్ సేవలు అందించాలని ఆయన సూచించారు. బ్యాంక్ జోనల్ మేనేజర్ జీఎస్‌డీ ప్రసాద్ మాట్లాడుతూ తమ బ్యాంక్ గత నాలుగేళ్లుగా అభివృద్ధి సాధిస్తోందన్నారు. పొదుపు ఖాతాలు, ప్రభుత్వ పథకాలు, వ్యవసాయం, వెహికల్, ఎడ్యుకేషనల్ రుణాలు వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయని వివరించారు. డెప్యూటీ జోనల్ మేనేజర్ రజనీ కుమార్, బ్రాంచి మేనేజర్ మోనికా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



మైలవరం: ఆడుదాం ఆంధ్రా రాష్ట్ర స్థాయి వాలీబాల్ మహిళా పోటీలకు మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు నలుగురు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ రవి మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన విద్యార్థినులు శ్రీవల్లి, సీతాకుమారి, జాస్మిన్, సుమత్రలు స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులతో పాటు ఫిబ్రవరి 9 నుంచి విశాఖపట్నంలో జరిగే స్టేట్ మీట్ వాలీబాల్ మహిళా పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, పీడీ మన్నే స్వామిని కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

చికిత్సపొందుతున్న యువకుడి మృతి

నందిగామ: రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. మండలంలోని మాగల్లు గ్రామానికి చెందిన షేక్ నాగుల్‌మీరా(20) మరో ఇద్దరుమిత్రులతో కలిసి ద్విచక్రవాహనంపై బుధవారం నందిగామకు వస్తున్నారు.ఈ క్రమంలో మండలంలోని పల్లగిరి సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన నాగుల్ మీరాను విజయవాడ తరలించగా గురువారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దుర్గామహేశ్వరరావు తెలిపారు.

ముస్లింలను దేశద్రోహులన్న చంద్రబాబు

- వైఎస్సార్ సీపీ విజయవాడ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్
- 54వ డివిజన్‌లో పర్యటించిన ఆసిఫ్, మేయర్



వించిపేటలో వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఆసిఫ్, మేయర్



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఆసిఫ్, వైఎస్సార్ సీపీ, ముస్లిం మైనార్టీ నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముస్లింలను దేశద్రోహులుగా చిత్రీకరించి ముస్లిం యువకులపై కేసులు పెట్టిన మైనార్టీ ద్రోహి చంద్రబాబునాయుడు అని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ అన్నారు. గడపగడపకు మన ఆసిఫ్ కార్యక్రమంలో భాగంగా 54వ డివిజన్ కార్పొరేటర్ అర్షద్ ఆధ్వర్యంలో షేక్ ఆసిఫ్ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి వించిపేటలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గడపగడపకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు మొదటి నుంచి ముస్లిం మైనార్టీలను అన్ని విధాలుగా అణగదొక్కారన్నారు. చంద్రబాబు 2014 నుంచి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏ ఒక్క ముస్లిం శాసనసభ్యుడు లేరన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖకు సైతం ముస్లిం మంత్రి లేరని దుయ్యబట్టారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సమస్యలపై ముస్లిం యువత ప్రశ్నిస్తే వారిపై దేశద్రోహులుగా కేసులు పెట్టారని వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ముస్లింలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చారన్నారు. ఆయన తండ్రి దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి నాలుగు శాతం రిజర్వేషన్లను కల్పించి ముస్లింల అభ్యున్నతికి పునాదులు వేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మరో రెండు అడుగులు వేసి రాజ్యాధికారంలో ముస్లిం మైనార్టీలను భాగస్వాములను చేశారని వివరించారు. రానున్న ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలందరూ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. ముఖ్యమంత్రి పశ్చిమ నియోజకవర్గ సీటును ముస్లింలకు కేటాయించి గౌరవించారని వివరించారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేయాలి : మేయర్

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి వేగవంతంగా జరుగుతోందన్నారు. నియోజకర్గం మొత్తం సీసీ రోడ్లు వేశామన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో తమ ప్రభుత్వం ముందు భాగంలో ఉందన్నారు. తొలుత పంజా సెంటర్‌లోని దర్గాలో ప్రార్థనలను నిర్వహించి పర్యటనను ప్రారంభించారు. కార్యక్రమంలో అబ్దుల్ వహాబ్, పైడాడ శ్రీనివాసరావు, సయ్యద్ అతీక్, సలీమ్, ఖాదర్, మొయిన్, బాషీ, అమాన్, బాజీ, మధిర ప్రభాకర్, శ్రీనివాసరెడ్డి, శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగర ప్రజలకు తాగునీటి సరఫరా అందించాలి



డ్రైన్లను పరిశీలిస్తున్న వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగర వాసులకు నిరంతరం తాగునీటి సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా చర్యలు తీసుకోవాలని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. వీరిరువురూ గురువారం 31వ డివిజన్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. హెడ్ వాటర్ వర్క్స్‌లో నీటిశుద్ధి, సరఫరాపై సూచనలు చేశారు. నగరంలో ఎల్లప్పుడూ పారిశుధ్య నిర్వహణ జరగాలని, కాల్వల్లో సిల్టు తొలగింపు ప్రతినిత్యం జరగాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలు, వర్షపు నీరు వెళ్లే డ్రైన్లు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కొత్త పైపులైన్లు వేయటం కోసం తవ్విన రోడ్డును నాణ్యతా ప్రమాణాలతో ఎప్పటికప్పుడు పునరుద్ధీకరిస్తూ ఉండాలని, నగరంలో జరుగుతున్న యాంటీ లార్వా ఆపరేషన్స్ మరింత విస్తృతం చేయాలని, అనధికార ఆక్రమణలను తొలగించాలన్నారు. ఈ పర్యటనలో 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రామ కోటేశ్వరరావు, సూపరింటెండెంట్ ఇంజినీర్ రామ్మోహన్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ –2 శ్రీనివాస్, బయాలజిస్ట్ సూర్య నాయక్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కత్తితో దాడి చేసిన నిందితుడి అరెస్టు

నిందితుడి నుంచి 1.240 కిలోల గంజాయి స్వాధీనం

చిట్టినగర్(విజయవాపశ్చిమ): ఆటోడ్రైవర్‌పై కత్తితో దాడికి పాల్పడిన నిందితుడిని కొత్తపేట పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 1.240 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కొత్తపేట సీఐ టి.గణేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట శ్రీనివాస మహల్ కొండ ప్రాంతానికి చెందిన గీసాల జగదీష్‌పై ఈ నెల 4వ తేదీన ఓ వ్యక్తి కత్తితో దాడి చేసి గాయపరిచారు. దీనిపై కేసు నమోదు చేసిన కొత్తపేట పోలీసులు ఘటనా స్థలంలో సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడు పీతాని అప్పలస్వామి వీధికి చెందిన దల్లి నవీన్ అలియాస్ బిళ్లగా గుర్తించారు. రైల్వే ఆప్ యార్డు వద్ద నిందితుడు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో సీఐ గణేష్ అక్కడకు వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 1.240 కిలోల గంజాయిని గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా, నెల్లూరు జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం జగన్‌తోనే సాధ్యం

- 45వ డివిజన్‌లో గడపగడపకు వైఎస్సార్ సీపీ
- కొండ ప్రాంతాల్లో పర్యటించిన నేతలు



గడప గడపకు వైఎస్సార్ సీపీలో ఆసిఫ్, కార్పొరేటర్ మాధురి లావణ్య తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి అవసరమైన సంక్షేమ పథకాలను అందించడం సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. 45వ డివిజన్ పరిధిలో గురువారం గడప గడపకు వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పశ్చిమ ఇన్‌చార్జి ఆసిఫ్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ మైలవరపు మాధురీ లావణ్య, పలువురు కార్పొరేటర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. పాలప్రాజెక్టు ఫ్లై ఓవర్ నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించగా, కబేళా, రామరాజ్యనగర్, రాము క్వారీ ప్రాంతాల్లో సాగింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించడంతో పాటు ఆయా కుటుంబాలు ఏ విధంగా లబ్ధి పొందాయనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సంక్షేమానికి రూపొందించిన పథకాలు కొనసాగాలంటే మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలని కోరారు. రానున్న ఎన్నికలలో జగన్ అన్న కోసం వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆంజనేయరెడ్డి, మహాదేవు అప్పాజీ, మరుపిళ్ళ రాజేష్, షేక్ ఇర్ఫాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు మైలవరపు కృష్ణ, మైలవరపు దుర్గారావు, ముత్తా వాసు, బి. కోటేశ్వరరావు, ఎం.రాంబాబు, బి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

చేనేత, హస్తకళల అభివృద్ధికి సిడ్బీ ప్రోత్సాహం



ప్రదర్శనను ప్రారంభిస్తున్న సిడ్బీ బ్యాంకు కార్యదర్శి రామకృష్ణ, నేస్తం ఫౌండేషన్ సీఈఓ సురేష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): చేనేత, హస్త కళాకారులు తయారు చేసిన వివిధ రకాల ఉత్పత్తులను సిడ్బీ ద్వారా మార్కెటింగ్ చేసి, వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్లు సిడ్బీ బ్యాంకు కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. మహాత్మాగాంధీ రోడ్డులోని పీవీపీ మాల్‌లో సిడ్బీ బ్యాంకు, నేస్తం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళల ప్రదర్శనను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర ప్రజలు కూడా చేనేత వస్త్రాలు, హస్త కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి, వారిని ప్రోత్సహించాలని విజ్ఞప్తిచేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రదర్శనలు ఏర్పాటు చేసి, గ్రామీణ ప్రాంత ప్రజల ప్రతిభను నేటి తరానికి తెలియజేస్తున్నట్లు తెలిపారు. నేస్తం ఫౌండేషన్ సీఈఓ సురేష్ వీసం మాట్లాడుతూ సిడ్బీ సహకారంతో స్టాల్ ఇన్ మాల్ పేరుతో చేనేత, హస్తకళల ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రదర్శనలో కొండపల్లి, ఏటి కొప్పాక బొమ్మలు, మంగళగిరి చేనేత వస్త్రాలు, వెంకటగిరి పట్టు చీరలు ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో నేస్తం ఫౌండేషన్ ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రతిభాశాలి శ్రీరామమూర్తి



హరికథా భాగవతారిణి దుర్గామహాలక్ష్మిని సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి గుడిపాటి శ్రీరామమూర్తి అని గుడిపాటి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు జయరాంసుధాకర్ అన్నారు. గుడిపాటి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన సత్యనారాయణపురం సీతారామ కల్యాణ మండపంలో గురువారం సంగీత విద్వాంసుడు, రచయిత, హరికథా భాగవతార్ గుడపాటి శ్రీరామమూర్తి 117వ జయంతి వేడుకలు, సంగీత, హరికథా గానం, హరికథా భాగవతారిణి మోపిదేవి దుర్గామహాలక్ష్మికి ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాంసుధాకర్ మాట్లాడుతూ హరికథలు తెలుగు వారి ఆత్మ అని వాటికి జాతీయ స్థాయి గుర్తింపు తీసుకువచ్చిన వ్యక్తి శ్రీరామమూర్తి అన్నారు. వారి సేవలను గుర్తు చేసుకుంటూ మోపిదేవి దుర్గామహాలక్ష్మిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. సత్కార గ్రహీత దుర్గామహాలక్ష్మి మాట్లాడుతూ హరికథా సాంప్రదాయానికి విశేష కృషి చేసిన శ్రీరామమూర్తి సేవలను భావితరాలకు అందించడానికి గుడిపాటి భక్తిగాన సుధ ఛానల్ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. సంస్థ సభ్యుడు గుడిపాటి దత్తు, సంగీత విద్వాంసుడు దావులూరి వీరభద్రరావు, శ్రీరామమూర్తి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా పర్వతం లలిత సీతారామ కల్యాణం కథను గానం చేశారు. జయరాంసుధాకర్ సుందరాకాండ హరికథను వినిపించారు. భక్తి రంజని కార్యక్రమంలో నేరెళ్ల కల్యాణి, వల్లూరి రాధా, ప్రణవి, సంతోషిలు అన్నమయ్య, రామదాసు కీర్తనలను గానం చేశారు.

దేవునిపై విధేయతతో ఉండాలి



విమలారెడ్డిని సత్కరిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, ఆసిఫ్ తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): దేవునిపై విధేయతతో ఉండాలని, ఆయన చిత్తం ప్రకారం నడుచుకోవాలని వైఎస్ విమలారెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ , పశ్చిమ నియోజకవర్గ పాస్టర్ల ఆధ్వర్యంలో పాలప్రాజెక్టు సమీపంలోని కల్యాణ మండపంలో గురువారం దైవ సేవకుల సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని దైవ సేవకులు ప్రార్థనలు, విజ్ఞాపనల ద్వారా దేవుని వేడుకోవాలని కోరారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలనే ఆశయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, ఆయనకు అండగా ఉండాలన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన విమలారెడ్డిని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మేడిది జాక్సన్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పోలిమెట్ల శరత్‌బాబు, వైఎస్సార్ సీపీ అడ్వయిజరీ క్రిస్టియన్ అఫైర్స్ ఫాదర్ బాలస్వామి, కొడాలి ప్రేమ్‌దర్శన్, బందెల దయానందం, జ్యోతి ఆనంద్, ఎం.ప్రేమ్ కుమార్, గేరా హానోకు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా మేరీమాత శతాబ్ది ఉత్సవాలు



గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం

గుణదల (విజయవాడ తూర్పు): క్రైస్తవులకు పరిశుద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న గుణదల మేరీ మాత శతాబ్ది ఉత్సవాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగనున్నాయి. ఏటా ఘనంగా నిర్వహించే ఈ ఉత్సవాలు ఈ ఏడాది నూరు వసంతాలు పూర్తి చేసుకున్న తరుణంలో మరింత అట్టహాసంగా నిర్వహించనున్నారు. దేశంలోనే అతిపెద్ద క్రైస్తవ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంగా పేరు గాంచిన ఈ ఆలయంలో 9,10,11 తేదీలలో తిరునాళ్ల వైభవంగా జరుగుతాయి. సుదూర ప్రాంతాల నుంచి లక్షలాది మంది యాత్రికులు పుణ్యక్షేత్రాన్ని సందర్శించనున్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు సిద్ధం..

గుణదల మేరీమాత ఉత్సవాలు సమర్థంగా నిర్వహించే దిశగా ఆలయ కమిటీ, పుణ్యక్షేత్ర గురువులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మూడు రోజుల పాటు సమష్టి దివ్యబలి పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు బిషప్ గ్రాసి పాఠశాల ప్రాంగణంలో చలువ పందిళ్లు సిద్ధం చేశారు. కొండపైకి భక్తులు వెళ్లేందుకు, తిరిగి వచ్చేందుకు వేరు వేరుగా మార్గాలను ఏర్పాటు చేశారు. భక్తులు తలనీలాలు సమర్పించే కేశ ఖండన శాలను విస్తరింప చేసి నీటి సదుపాయాన్ని కల్పించారు. మరియ మాత స్వరూపం వద్ద భక్తులు దర్శనానికి వెళ్లే సమయంలో తొక్కిసలాట జరుగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

వీఎంసీ అధికారుల చర్యలు..

మేరీమాత ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు తాగునీరు, మొబైల్ మరుగుదొడ్లు, అందుబాటులో ఉంచారు. పుణ్యక్షేత్ర ప్రాంగణమంతా బ్లీచింగ్ పౌడర్ తో శుభ్రపరిచారు. యాత్రికులు అనారోగ్యానికి గురైతే ప్రథమ చికిత్స చేసేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీఎంసీ అధికారులతో పాటు విద్యుత్ శాఖ అధికారులు సైతం ఉత్సవాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. దిగువ నుంచి కొండ శిఖరాగ్రం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. ప్రత్యేక సిబ్బందిని నియమించి సరఫరా సజావుగా జరిగేట్లు జాగ్రత్తలు పాటిస్తున్నారు.

భారీగా పోలీస్ బందోబస్తు

విజయవాడ కమిషనరేట్ పరిధిలోని 1088 మంది పోలీసు సిబ్బందిని ఈ ఉత్సవాల నిమిత్తం నియమించారు. గుణదల పుణ్యక్షేత్ర పరిసరాలన్నీ బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ మూడు రోజులు కొండపై 24 గంటలు మూడు షిఫ్టులలో పోలీసులు విధులు నిర్వహించనున్నారు. ఇది కాక మరో 300 మందికి పైగా ట్రాఫిక్ పోలీసులు విధుల్లో ఉండి భక్తులకు ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా రామవరప్పాడు రింగ్, గుణదల, మాచవరం, చుట్టుగుంట, మొగల్రాజపురం, క్రీస్తురాజపురం ప్రాంతాలలో వాహనాలను నియంత్రిస్తారు.

నేటి కార్యక్రమాలు..

ఉదయం

6:00 గంటలకు– ప్రారంభ ప్రార్థనలు.
7:00 గంటలకు – సమష్టి దివ్యబలి పూజ.
10:00 గంటలకు - పవిత్రాత్మ నూత్నీకరణ ప్రార్థనలు
11:00 గంటలకు – కోలాటం
11:30 గంటలకు – దివ్యబలి పూజ దేవాలయంలో

మధ్యాహ్నం

12:30 గంటలకు – సాంస్కృతిక కార్యక్రమాలు
2:00 గంటలకు – కోలాటం
3:00 గంటలకు - పవిత్రాత్మ నూత్నీకరణ ప్రార్థనలు
తేరు ప్రదక్షిణ

సాయంత్రం

6:00 గంటలకు – సమష్టి దివ్యబలిపూజ

రాత్రి

8:30 గంటలకు – లూర్దుమాత సంక్షిప్త చరిత్ర
9:00 గంటలకు – గాన కచేరి
10:00 గంటలకు – సంసోను, డెలీల
11:00 గంటలకు – దావీదు విజయం–నాటకం
1:00 గంటలకు – రక్తపాశం – నాటకం

గుణదల ఉత్సవాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

బస్టాండ్(విజయవాడపశ్చిమ): నగరంలో కొలువుదీరిన గుణదల మేరీ మాత ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రజా రవాణా సంస్థ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తుల కోసం పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ సిటీ టెర్మినల్, కాళేశ్వరరావు మార్కెట్, రైల్వే స్టేషన్‌ల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఆయా మార్గంలో నిత్యం నడుపుతున్న బస్సులకు అదనంగా గవర్నరుపేట–1, 2, విద్యాధరపురం డిపోల నుంచి 9వ తేదీన 20 బస్సులు, 10,11 తేదీలలో 24 బస్సుల చొప్పున అదనంగా నడపటానికి ఏర్పాట్లు చేసినట్లు ప్రజా రవాణా సంస్థ జిల్లా అధికారి ఎం.వై ఏసుదానం తెలిపారు. భక్తులు ఈ ప్రత్యేక బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. భకుల రద్దీ అధికంగా ఉంటే మరిన్ని బస్సు సర్వీసులను నడిపేందుకు అన్ని ఏర్పాట్లను చేసినట్లు ఆయన తెలిపారు.

అనారోగ్య కారణాలతో యువకుడు ఆత్మహత్య

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అనారోగ్య కారణాలతో యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో గురువారం జరిగింది. ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీ బ్లాక్ నంబరు 108లో పెందుర్తి జయలక్ష్మి, రాజు దంపతులు నివాసం ఉంటున్నారు. రాజు షాపింగ్ మాల్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తుండగా, జయలక్ష్మి ఓ దుస్తుల దుకాణంలో పనిచేస్తుంది. కొంత కాలం కిందట రాజుకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో పని మానేసి ఇంట్లోనే ఉంటున్నాడు. గురువారం ఉదయం భార్య జయలక్ష్మి పనికి వెళ్లగా ఇద్దరు పిల్లలు స్కూల్‌కు వెళ్లారు. సాయంత్రం 4:30 గంటల సమయంలో రాజు ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనపై మృతుని భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వివాహితపై దాడి

జగ్గయ్యపేట అర్బన్: వివాహితపై గుర్తుతెలియనివ్యక్తి పదునైన ఆయుధంతో దాడిచేయడంతో ఆ మె తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం రాత్రి జగ్గయ్యపేట పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ సీఐ జానకీరాం కథనం ప్రకారం .. పశ్చిమగోదావరి జిల్లా తణుకు ప్రాంతానికి చెందిన గోపిరెడ్డి సత్యశ్రీ(36)అనే మహిళ నాలు గేళ్లుగా పట్టణంలోని సీతారామపురంలో కొత్త వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో నివాసం ఉంటూ స్థానిక ముక్త్యాలరోడ్‌లో డెయిరీ షాపు నడుపుకుంటూ జీవిస్తుంది. భర్త విజయవాడలో వ్యా పారం చేస్తుండగా, ఇంటర్ చదువుతున్న బిడ్డ ఆమెతోనే ఉంటుంది. ఈక్రమంలో బుధవారం రాత్రి తనఇంటి ముందు నిలుచుని ఫోన్‌లో మాట్లాడుతుండగా గుర్తుతెలియనివ్యక్తి బైక్‌పై హెల్మెట్ ధరించి వచ్చి పదునైన ఆయుధంతో ఆమెపై దాడిచేసి పారిపోయాడు. ఈ ఘటనలో బలమైన గాయం అవడంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. స్థానికులు గమనించిన ఆమెను ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అనంత రం మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తరలించారు. సంఘటనా స్థలాన్ని సీఐ జానకీరామ్ సందర్శించి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు, ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

కోలాహలంగా వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వైఎస్సార్ సీపీ ఆత్మీ య సమావేశం కొండపల్లిలో గురువారం రాత్రి కోలాహలంగా జరిగింది. మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు యాదవ్‌కు జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య, వార్డు కౌన్సిలర్లు జోగి రాము, గుంజా శ్రీనివాస్, ఎం.చంద్రశేఖర్, దయా తదితరులు ఆత్మీయ స్వాగతం పలికి నాయకులు, కార్యకర్తలకు పరిచయం చేశారు.

అమర గాయనీ గాయకుల సేవలు వెలకట్టలేనివి



విజయవాడ కల్చరల్: అమర గాయనీ గాయకుల సేవలు వెలకట్టలేనివని విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్‌రాజు అన్నారు. సురభి కళావేదిక ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని కౌతా పూర్ణ కళావేదికమీద అమర గాయకుల మధుర గీతాలు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. డేవిడ్‌రాజు మాట్లాడుతూ సంగీత సాహిత్యాలను మేళవిస్తూ నాటి గాయనీ గాయకులు మధుర గీతాలను నిబద్ధతతో గానం చేశారని పేర్కొన్నారు. గాయనీ గాయకులు సింగంపల్లి రమణ, కొమ్మినేని రత్నకుమారి, పద్మ, మీనాకుమారి, బీహెచ్ కామేశ్వరి, షబానా, సువర్ణలక్ష్మి, ఉమాశంకర్, దండు చంద్రశేఖర్ పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.